
# జనపదం
J A N A P A D H A M

హైదరాబాద్ | బుధవారం 14 ఆగస్టు 2024

తెలుగు దినపత్రిక

## విద్యుత్ కాంతుల్లో గోల్కొండ కోట..

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు గోల్కొండ కోట ముస్తాబైంది. కోటను విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు. తివర్ణ పతాకాన్ని ప్రతిబింబించేలా కాషాయం, తెలుపు, ఆకుపచ్చ రంగులు దేదీప్య మానంగా వెలిగేలా ముస్తాబు చేశారు. విద్యుత్ కాంతులతో గోల్కొండ కోట మెరిసిపోతోంది. సీఎం రేవంత్ రెడ్డి జెండా ఆవిష్కరణ చేయనున్నారు.





### టార్గెట్ గులాబీ మాజీలా....?

### ఫస్ట్ వికెట్ దానం..

తర్వాత మల్లారెడ్డి అండ్ టీం మేట్స్..

జాబితా అంతా గులాబీలో 'అతి'దారులదే..

'ఏవీ' వదలని రంగనాథ్..

వరంగల్ లోనూ తన మార్కు పనితీరు..

తట్టుకోలేకే రంగనాథ్ కు దానం వార్నింగ్

సీఎం దగ్గరే తేల్చుకుంటానని వ్యాఖ్య..

హైడ్రాతో నగర స్థితిగతులు మెరుగు..

# కత్తిరింపే..?

## హైడ్రాకు పూర్తి అధికారాలు..

కొట్టక తిట్టక వట్టలు వాయించడం.., మట్టి అంటుకోకుండా పని పూర్తి చేయడం అంటే ఇదేనేమో. పడేయాలంటే పట్టుకోవాల్సిన అవసరం లేదు., బలియ్యాలంటే బంధీగా చూపాల్సిన అక్కర అంతకన్నా లేదు. సమయం, సందర్భం కుదిరితే అన్నీ వాటంతట అవే జరుగుతాయి. అంతేగానీ 'నేను లోకల్., అలాంటోళ్లు వస్తుంటారు.., పోతుంటారు..,' అనే సినిమా డైలాగులతో ఏదో చేయాలనుకోవచ్చే మోగానీ, అతడు రంగంలోకి దిగితే 'ఇన్ని రోజులు ఒక లెక్కా.., ఇప్పటి నుంచి ఇంకో లెక్క..' అనే బాపతే. పని తప్ప మరేమి పట్టని ఆయన రంగంలోకి దిగాడో స్వయంగా పంపించిన పెద్దలు చెప్పినా వినని మొండిఘటం.


**జనపదం, బ్యూరో:** చెరబట్టిన వారి ముగింపు ఆసన్నమైనట్టే. ఆక్రమించిన వారు అన్నీ వదిలేసి పారిపోవాల్సిందే. 'హైడ్రా' రూపకల్పనతో భూమి సంబురప డుతుంటే, తమ అంతే చూడడానికి ఏర్పాటు చేశారని ఆ తరహా వాళ్లు హైరా నాపడుతున్నారు. ఎక్కడ విధుల్లో ఉన్నా తనమార్కు పనితనంతో సామాన్యుడికి బాసటగా నిలిచే స్వభావమున్న అధికా రిగా పేరున్న ఆయన పర్యవేక్షణలో కొలు వుదీరిన కొత్త కార్యాలయం ఇప్పుడు ఆబా పతుగాళ్లకు ఓ హడల్. ఆక్రమించింది ఆ పక్షమా., ఈ పక్షమా.. అనే తేడాలు చూడకుండా అన్యాయమా.., అక్రమమా.., అనేది మాత్రమే చూస్తూ ఫాస్ట్ జస్టిస్ అనేలా వ్యవహరించే అధికారి కావడంతో అలాంటి వాళ్లందరికీ ఆయనంటే భయం.

బాధితులంతా దేవుడని కొలుచుకునే ఏవీ రంగనాథ్ ను ఇప్పుడు హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ ఎసెట్స్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) చీఫ్ గా రాష్ట్ర సర్కార్ నియమించడంతో కబ్జాలతో పూడుకుపోయిన భాగ్య నగరం పులకిస్తుంటే, నీళ్లల్లో పేకమేడలు కట్టిన వాళ్లు వణికిపోతున్నారు.

**టార్గెట్ గులాబీ మాజీలా....?**

అధికారం ఉందని కన్నూమిన్నూ కానకుండా వ్యవహరించిన గులాబీ నేతలే టార్గెట్ గా హస్తం సర్కార్ ప్రణాళికలు రూపొందించినట్టు సమాచారం. అధికారం పోగానే పాపాల నుంచి కాపాడుకోవడానికి వలసొచ్చిన గులాబీలే కాదు, రాజధాని చెరువులను బతకనివ్వకుండా చంపేస్తున్న వారెవరైనా

......(తరువాయి 2లో)



## పది రోజుల్లోనే

# ఫస్ట్ స్టెప్..

కాగ్నిజెంట్ విస్తరణకు ముహూర్తం ఫిక్స్..

ఈ నెల 5న న్యూజెర్సీలో రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు..

అనుకున్నట్టుగానే తొలి అడుగు..

సీఎం చేతుల మీదుగా రేపు

కంపెనీ విస్తరణకు శ్రీకారం

హాజరుకానున్న సీఈవో రవికుమార్

విస్తరణతో మరో 15 వేల మందికి ఉద్యోగాలు

హైదరాబాద్‌లో ఇప్పటికే ఆయిదు క్యాంపస్‌లు

57 వేల మందికి ఉద్యోగ అవకాశం

3



## ఆర్ఆర్ఆర్ పై సర్కార్ ఫోకస్..

- సెప్టెంబర్ లో భూ సేకరణ పూర్తికి చర్యలు..
- వరుస సమీక్షలు చేస్తున్న సీఎస్ శాంతికుమారి
- భూసేకరణ ప్రక్రియ వేగం చేయాలని కలెక్టర్లకు ఆదేశం

3

## బాపూ.. మాట్లాడు....



- కేసీఆర్ మౌనమెందుకో..
- బిడ్డను పరామర్శించడు.., శ్రేణులకు ధైర్యం చెప్పడు..
- కేడర్ లో నిరాసక్తి..
- పార్టీ పలుచనవుతోందని తీవ్ర ఆవేదన..
- స్థానిక పోరుకైనా బయటికొచ్చేనా..?

2

బాపూ.. మాట్లాడవా.? ఏం పాపం చేశాం నాయినా..? ఎన్నో పుస్తకాలు చదివినోళ్లు., మరెన్నో ఆటుపోట్లు చూసినోళ్లు. మేధావి మౌనం ఎన్నో అనర్థాలకు మూలమని సందర్భం వచ్చిన ప్రతిసారి సెలవిచ్చే మీరేనా ఉలుకుపలుకు లేకుండా ఉంది. రాష్ట్రంలో ఇంత జరుగుతున్నా మీరు మౌనంగా ఉండడం తీవ్రంగా కలిచివేస్తోంది బాపు. దయచేసి నోరు విప్పు. మమ్మల్ని కాపాడు., కబంధ 'హస్తాల' నుంచి రక్షించు. మీ భాషలోనే చెప్పాలంటే అప్ అండ్ డౌన్స్..., కష్టసుఖాలు.., గెలుపోటములు.. అతి సహజమే కదా. అంత చెప్పిన మీరు ఎనిమిది నెలలు గడుస్తున్నా ఎందుకు స్థిమిత పడడం లేదు., మరెందుకు కాలు బయట పెట్టడం లేదు. ఇకనైనా రంగం సిద్ధం చెయ్., నీవారికి నేనున్నాననే భరోసా ఇయ్యి.

- జనపదం, బ్యూరో



## రాష్ట్రానికి జ్వర మొచ్చింది...

- రోగులతో దవాఖానలు కిటకిట..
- ఏ హాస్పిటల్లో చూసినా వైరల్ ఫీవర్ బాధితులే..
- ఎక్కువగా హెపటైటిస్, చికెన్ గున్యా, డెంగీ కేసులే..

2

## ఎన్నాళ్లకెన్నాళ్లకు..

- కాంగ్రెస్ పెద్దల్లో పంద్రాగస్టు సంబురం..
- జెండా ఎగురేసే నేతల జాబితా విడుదల..
- గోల్కొండలో సీఎం..
- జిల్లా కేంద్రాల్లో మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు, కార్పొరేషన్ల చైర్మన్లు..
- పదేళ్ల నిరీక్షణ తర్వాత హస్తం నాయకులకు నిజమైన పండుగ..


3



## కారం మెతుకులే గతి..

- ఖాళీ కడుపులతో చదువులు..
- దిగజారిన గురుకులాల పరిస్థితి..
- కనీస వసతులు కరువు..
- పట్టించుకోని ప్రభుత్వం..
- ప్రభుత్వ తీరు పై హరీష్ ఫైర్..

3



## రూపాల్ రెడ్డి...

- ఏసీబీ వలలో జాయింట్ కలెక్టర్ భూపాల్ రెడ్డి..
- రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడిన సీనియర్ అసిస్టెంట్ మధుమోహన్ రెడ్డి
- సార్ పంపిస్తేనే వచ్చానన్న సీఏ
- రూ.8 లక్షలతో అడ్డంగా బుక్..
- అప్పటి కప్పుడే ఫోన్లో మాట్లాడించి కన్ఫమ్ చేసుకున్న అధికారులు..
- భూపాల్ రెడ్డి ఇంట్లో సోదాలు..
- అవినీతి నిరోధక శాఖ అదుపులో ఇద్దరు అధికారులు..

2

# విద్యార్థుల మృతి బాధాకరం



- ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు
- పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేస్తాం..
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- పెద్దాపూర్ గురుకుల విద్యార్థుల తల్లి దండ్రులతో భేటీ

- వివరాలు3లో

## సెప్టెంబర్ 2 వరకు కస్టడీ..



- ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, ఎమ్మెల్సీ కవితకు నో బెయిల్..
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా న్యాయమూర్తి ఎదుట హాజరు..
- మద్యం పాలసీ కేసులో విచారణ ఎదుర్కొంటున్న నేతలు..
- నిరాశలో బీఆర్ ఎస్ శ్రేణులు..

2

# కత్తిరింపే..?

(మొదటి పేజీ తరువాయి) వదిలేది లేదనే సంకేతాలి చ్చేలా హైడ్రాకు రూపకల్పన చేసింది. ఆ పదేళ్లు కేసీఆర్ అండలుండగా తమకేలా అడ్డూఅదుపు అన్నట్టుగా వ్యవ హరించిన వారంతా ఇప్పుడు దోషులుగా మారాల్సిం దే. ప్రజల సొమ్మును ఫలహారంగా భోంచేసి, అప్పటి ప్రతిపక్షాలను, అడిగిన జనాలను ముప్పుతిప్పలు పెట్టిన వారు అనుభవించాల్సిందే. ఇన్నాళ్లకు కాంగ్రెస్ కు అవ కాశం వచ్చింది. రాజధానిలోని వందల చెరువులు ఎ లా కుచించుకుపోయాయో తెలియజేయాల్సిన బాధ్య త తమపై ఉందని భావించి గొప్ప చర్యకు శ్రీకారం చు ట్టింది. డైనమిక్ ఐపీఎస్ అధికారికి బాధ్యతలు అప్పగిస్తే జరగాల్సిన కార్యం అదే జరుగుతుందని సీఎం సైలెంట్ గా సంకేతాలు ఇచ్చారు. గులాబీలోని ఆక్రమ ణ దారు లు, చెరువు శిఖాలు, ఎఫ్ టీఎల్ లను వదలని వారు, నీరు నిలవాల్సిన చోట అద్దెల మేడలు నిర్మాణా లు చేసిన వారు ఇప్పుడు దోషులుగా మారాల్సిన తరుణం ఆసన్నమైంది.

### హైడ్రాకు పూర్తి అధికారాలు..

హైడ్రాకు అవసరమైన ఆఫీసర్లు, సిబ్బంది ను ప్రభుత్వం కేటాయించింది. ఈ మేరకు మంగళవారం 259 మంది ఆఫీసర్లు, సిబ్బంది ని కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేసింది. అందులో ఒక ఐపీఎస్, ముగ్గురు గ్రూప్ వన్ స్థాయి ఎస్పీలు, ఐదుగురు డిప్యూటీ స్థాయి సూప రింటెండెంట్లు, 21 మంది ఇన్ స్పెక్టర్లు, 33 సబ్ ఇన్ స్పెక్టర్లు, ఐదుగురు రిజర్వ్ ఇన్ స్పెక్టర్లు, 12 మంది రిజర్వు ఎస్సైలు, 101 మంది కానిస్టేబుళ్లు, 72 మంది హోంగార్డులు, ఆరుగురు అనలిటికల్ ఆఫీసర్లు ఉంటారని పేర్కొంటూ మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిశోర్ ఉత్తర్వులు విడుదల చేశారు.

### ఫస్ట్ వికెట్ దానం..

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ ఎంసీ) పరిధిలోని జూబ్లీహిల్స్ రోడ్ నం 69 నందగిరి హిల్స్ లో జీహెచ్ఎంసీకి చెందిన ప్రభుత్వ స్థలం ప్రహ రీ కూల్చివేతకు సంబంధించి ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పై కేసు నమోదైన సంగతి తెలిసిందే. ప్రభుత్వ భూముల రక్షణకు చేసిన కట్టడాన్ని ఇష్టారీ తిగా పడగొట్టిన ఎమ్మెల్యే ఇప్పుడు కోర్టు మెట్లు ఎక్కాల్సి న పరిస్థితి. ఎటు మొగ్గుంటే అటు, ఏ రంగు మంచిగని పిస్తే అటు వెళ్తాడని స్వయంగా అనుచరులే పేర్కొనే దానం ఇప్పుడు అధికార పార్టీలో ఉన్నా సంజాయిషీ ఇచ్చుకోవాల్సిన దుస్థితి. తప్పు ఎవరు చేసినా వదిలేది లేదని హెచ్చరించిన ఏవీ రంగనాథ్ నాగేందర్ ను మాత్రం ఎందుకు విడుస్తాడని అంతా అనుకుంటు న్నారు. హైడ్రాలో మొట్టమొదటి వికెట్ ఖైరతాబాద్ ఎమ్మెల్యే రూపంలోనే చిక్కే చాయలే ఎక్కువగా కనిపి స్తున్నాయి. దానం తర్వాత మాజీ మంత్రి మ ల్లారెడ్డి అండ్ టీం మేట్స్ హైడ్రా కోరల్లో చిక్కుకునే అవకాశా లున్నాయి. మల్లారెడ్డి తన విద్యాసంస్థల నిర్మాణాలను ఆక్రమించిన భూములు, కబ్జా చేసిన స్థలాల్లోనే చేశార ని ఇప్పటికే సంబంధిత శాఖలు తేల్చిన విషయం తెలి సిందే. ఇప్పుడు కొత్త అధికారాలతో రంగప్రవేశం చేసిన హైడ్రా.. వాటిని పునాదులతో సహా పెకిలించేందుకు ఎందుకు వెనకాడుతుంది మరి. అంటే ఒక్కొక్కరుగా కట్టుకున్న చెరువు మట్టిల్లోని మహా కట్టడాలు నేలమట్ట మవడానికి సమయం సమీపిస్తున్న చాయలు సుస్పష్టం. ఇప్పటికే ఏవీ రంగనాథ్ దగ్గర కబ్జా దారుల చిట్టీ మొత్తంగా ఉంది. పార్టీలతో సంబంధం లేకుండా పేట్రే గిపోయిన వారంతా ఇప్పుడు వలలో చిక్కుకుని విలవి లాడే సమయం రానే వచ్చింది. అందునా తెలంగాణ తొలి రెండు పర్యాయాలు అధికారంలో ఉన్న గులాబీలే అధికంగా ఉన్నారు. హైడ్రాతో చెరువులకు పూర్వపు కళ తీసుకువచ్చే పనిలో భాగంగా ఆ కారు పార్టీ అతిగా ళ్ల భరతం తప్పకుండా పట్టే తరుణం ఆసన్నమైనట్టు జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే తెలుస్తోంది.

### వరంగల్‌లోనూ తన మార్కు పనితీరు..

ఏవీ రంగనాథ్ అంటే ఏంటో వరంగల్ ప్రజలను అడిగితే ఇట్టే చెప్పుతారు. సీపీగా అక్కడ బాధ్యతలు స్వీకరించిన తర్వాత కబ్జాదారులు కంటికి కనిపించ కుండా పోయారంటే అతిశయోక్తి కాదు. అధికార పార్టీ కార్పొరేటర్లను సైతం వదలకుండా కటకటలాకు పం పించిన ధైర్యం అక్కడి ప్రజలు ఎప్పటికి మర్చిపోరు. ప్రభుత్వ చీఫ్ విప్ కు అత్యంత అంతరంగీకుడిని సైతం వదలకుండా జైలుకు పంపించి తానేంటో నిరూపించు కున్నారు. ఆయన పనితీరుతో ఎందరో బాధితులు న్యాయం పొంది ఊపిరి పీల్చుకున్నారు. ఆయనకు ధన్యవాదాలుగా పాలాభిషేకాలు చేశారు. ఇప్పుడు దానం నాగేందర్ పై కూడా కేసు నమోదు కావడంతో హైదరాబాద్ కూడా ఆనందంగా ఉన్నట్టు తెలుస్తోంది. అధికార పార్టీ నేతనే వదల్లేదంటే ఇక ఎవరైనా అంతే అనే సంకేతాలు లీడర్లలో పంపించారు. రంగనాథ్ పని తీరుకు నొచ్చుకుని దానం మాత్రం సినీ డైలాగులతో స్వీటుస్వీటుగానే ఘాటు వార్నింగ్ ఇచ్చాడ నే టాక్ కూడా వినవస్తోంది. తన విషయాన్ని సీఎం రేవంత్ దగ్గరే తేల్చుకుంటానని భీష్మించుకున్నారు. ఏదిఏమైనా హైడ్రాతో నగర దుస్థితికి చరమగీతం పాడి చెరబడిన చెరువులు సంకెళ్లు తెంచుకుని ఊపిరి పీల్చుకుంటా యని ప్రజలు మాత్రం హర్షిస్తున్నారు.

## చంటిగాడు లోకల్...



- అధికారులు వస్తుంటారు.. పోతుంటారు..
- దానం నాగేందర్ కీలక వ్యాఖ్యలు..
- ఏవీ రంగనాథ్ పై ఫైర్..
- చిలికి చిలికి గాలి వానగా వ్యవహారం..
- హైడ్రాతో కబ్జాదారుల్లో గుబులు మొదలు..

**జనపదం, హైదరాబాద్:** 'అధికారులు వస్తుంటారు. పోతుంటారు. నేను లోకల్..' అంటూ ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. గ్రేటర్ హైదరా బాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధి లోని జూబ్లీహిల్స్ రోడ్ నం 69 నందగిరిహిల్స్ లో జీహెచ్ఎంసీకి చెందిన ప్రభుత్వ స్థలం ప్రహరీని కూల్చివేతకు సంబంధించి ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పై కేసు నమోదైన సంగతి తెలిసిం దే. దీనిపై తాజాగా దానం నాగేందర్ స్పందించారు. కొత్తగా ఏర్పాటైన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పై పలు కీలక వ్యాఖ్యలు చేశాడు. తనను ప్రహరీ తొల గించిన కేసులో A3గా పేర్కొనడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం దానం నాగేందర్ హిమాయ త్ నగర్ డివిజన్ లో పలు అభివృద్ధి పనులకు శంకు స్థాపన చేసి ఆయా సం దర్భాల్లో మాట్లాడారు. ఒకా నొక దశలో తనపై నమో దైన కేసుపై మాట్లాడుతూ అధికారులు వస్తుంటారు... పోతుంటా రు., నేను లోకల్.. అని హైడ్రా కమిషనర్ ఏవీ రంగ నాథ్ పై వ్యాఖ్యలు చేశారు. రంగనాథ్ కు కొత్తగా వచ్చిన పదవి ఇష్టం లేనట్లుందన్నారు. అందుకే తనపై కేసు పెట్టారంటారన్నారు. నందగిరిహిల్స్ హుడా లే ఔట్ లో ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని అక్కడి వెళ్లిన ట్లు వివరించారు. అక్కడ జరిగిన విషయాన్ని రంగనా థ్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. హైదరాబాద్ కాస్మో పాలిటన్ సిటీ అని అన్నారు. అన్నివర్గాల ప్రజలకు సౌకర్యాలు కల్పించ డం, సమస్యలు తీర్చడం ప్రజాప్ర తినిధిగా తన బాధ్యత అని పేర్కొన్నారు. ఈ విషయా న్ని సీఎం దృష్టికి కూడా తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నా రు. అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటా మని చెప్పారు. కాగా, పార్క్ వద్ద గోడను కూల్చివేశా రనే ఆరోపణలపై దానంతో పాటు ఆయన అనుచరు లపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు.

### ఫిర్యాదుతో కేసు..

ప్రభుత్వ స్థలం ప్రహరీని ఈ నెల 10న కొందరు గు ర్తు తెలియని వ్యక్తులు కూల్చేసినట్టు పాపయ్య అనే వ్యక్తి ఫిర్యాదు లో పేర్కొన్నారు. ప్రహరీ కూల్చివేతతో రూ.10 లక్షల మేరకు నష్టం వాటిల్లిందన్నారు. ఎమ్మె ల్యేతో పాటు అతని అనుచరులపై భారతీయ శిక్షాస్మృ తి (IPC), పబ్లిక్ ప్రాపర్టీకి నష్టం కలిగించే నిరోధక చట్టం (PDPP), వివిధ సెక్షన్ల కింద కేసు పెట్టారు.



## గురుకుల పోస్టుల భర్తీని తదుపరి మెరిట్ అభ్యర్థులతో భర్తీ చేయాలి

- ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన కేటీఆర్..
- కేటీఆర్‌ను కలిసి సమస్యలు చెప్పుకున్న నిరుద్యోగ గురుకుల అభ్యర్థులు

**జనపదం, హైదరాబాద్:** గురుకుల పోస్టులలో భర్తీ కాకుండా మిగిలిపోతున్న పోస్టులను తదుపరి మెరిట్ అభ్యర్థులతో భర్తీ చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ , మాజీ మంత్రి కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నిరుద్యోగ గురుకుల అభ్యర్థులు మంగళవారం కేటీఆర్ ను ఆయన నివాసంలో కలిసి వారి సమస్యలను చెప్పుకున్నారు. ఈ సందర్భంగా వారు తమ సమస్యలను వాటి పరిష్కారాలను పలు కేటీఆర్ కు వివరిం చారు. గురుకుల బోర్డు చేపట్టిన నియమాకాలలో డౌన్ మెరిట్ లిస్ట్ ఆపరేట్ చేయడం ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. గురుకుల బోర్డు చేపట్టిన నియమాకాలలో 9024 పోస్టులలో డిసేన్డింగ్ ఆర్డర్ పాటించకపోవడం చాలామంది ఒకటి కంటే ఎక్కువ ఉద్యోగాలు రావడం మూలంగా సెకండ్ మెరిట్‌లో ఉన్న వారికి నష్టం జరుగు తున్నదని తెలిపారు. గురుకుల పోస్టులలో భర్తీ కాకుండా మిగిలిపోతున్న పోస్టులను తదుపరి మెరిట్ అభ్యర్థుల్లో భర్తీ చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, దీని కోసం ప్రతిపక్ష పార్టీగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని గురుకుల విద్యార్థులు కేటీఆర్ ను కోరారు. ఇప్పటికే తెలంగాణ హైకోర్టు జీవో ఎంఎస్ నెంబర్ 81ను సవాల్ చేస్తూ ఐదు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ ప్రభుత్వం తరుపున జీవో ఎంఎస్ నెంబర్ 81ను అడ్డంకిగా చూపిస్తూ హైకోర్టు ఇచ్చిన మధ్యంత ఉత్తర్వులు అమలు చేయకుండా కాలయాపన చేస్తుందని తెలిపారు. గతంలో టీఎస్ ట్రాన్స్కో, టీఎస్ ఎస్పీడీసీఎల్, టీఎస్ ఎన్పీడీఎస్ నిర్వహించిన వివిధ నోటిఫికేషన్లలో ప్రస్తుతం గురుకులాల్లో ఏర్పడు తున్నట్టుగానే భారీ సంఖ్యలో ఖాళీలు ఏర్పడే ప్రమాదం ఉన్నప్పుడు నిరుద్యోగులు నష్ట పోకుండా ఉండడం కోసం జీవో ఎంఎస్ నెంబర్ 81 అమలు చేయకుండా వన్ టైం రిలాక్సేషన్ కల్పించి పోస్ట్ మిగిలిపోకుండా డౌన్ మెరిట్ ఆపరేట్ చేసి తదుపరి మెరిట్ ఉన్న అభ్యర్థులను ఎంపిక చేయడం జరిగిందని కేటీఆర్ కు వివరించారు. గతం లాగానే ఈ గురుకుల పోస్టుల్లో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నెక్స్ట మెరిట్ అభ్యర్థులకు న్యాయం చేయాలని, దాని కోసం బీఆర్ఎస్ పార్టీగా ప్రతిపక్ష నాయకులుగా రాష్ట్రంలో ఉన్న గురుకులలతో పాటు డీఎస్సీ అభ్యర్థుల అనేకమంది న్యాయం కోసం ఎదురుచూ స్తున్నారని, తమకు న్యాయం చేసే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై కేటీఆర్ సానుకూలంగా స్పందిస్తూ తప్పకుండా గురుకుల విద్యార్థులకు, డీఎస్సీ విద్యార్థుల తరపున బీఆర్ఎస్ ప్రతిపక్ష పార్టీగా మీకు అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారికి ఫోన్ చేసి వీరి సమస్యను సానుకూలంగా పరిష్కరించాలని ఇందుకు ఉన్న అన్ని అవకాశాలను పరిశీ లించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గురుకుల నిరుద్యోగ విద్యార్థులు రత్న శేఖర్ రెడ్డి, స్వాతితో పాటు మాజీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి, విద్యార్థి విభాగం నాయకులకు గెల్లు శ్రీనివాసుతో పాటు నిరుద్యోగ విద్యార్థులు దామోదర్ రెడ్డి, విక్రమ్ తదితర నిరుద్యోగ విద్యార్థులు ఉన్నారు.

# బాపూ.. మాట్లాడు...

(మొదటి పేజీ తరువాయి)

### మౌనంతో భయం...



అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పరాజయం చవిచూసింది. కేసీఆర్ పదవీచ్యుతుడయ్యారు. అప్పటి నుంచి కష్టాలు ప్రారంభమయ్యాయి. ఎన్నెనా తట్టుకో గలిగేవాడేమోగానీ కూతురు అరెస్ట్, జైలు జీవితం గడు పుతున్న విషాదాన్ని భరించడం ఆయన వల్ల కావడం లేదని స్వయంగా ఆయన మాటల్లోనే వినిపించింది. ఎంత ఇబ్బందికర పరిస్థితులైనా స్పోర్టివ్ గా తీసుకోవా ల్సింది పోయి ముఖం చాటేయడం సరికాదని శ్రేణులు అంటు న్నాయి. రాజకీయాల్లో గెలుపోటములు సహజం ఓడి నంత మాత్రన ప్రజల్లోకి వెళ్లకుండా ఉండడం ఏంటని కేసీఆర్ తీరును కొందరు నేతలు తప్పుబడుతున్నారు.

### పార్టీని కాపాడుకుంటేనే ఉనికి..

కవిత జైలుకెళ్లి సుమారు 170 రోజులు కావొస్తుంది., పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు వెలువడి వంద రోజులు దగ్గరకు రాబోతోంది., అయినా కేసీఆర్ ఎందుకు అక్టివ్ గా మారడం లేదో అర్థం కాక పార్టీ నేతలు తలలుపట్టుకుం టున్నారు. గతంలో చంద్రబాబు అనుసరించిన వ్యూహాలనే అనుసరించాలని, అధికారం కోల్పోయినా కేడర్ ను కంటికి రెప్పలా కాపాడుకుని అధికారాన్ని కైవసం చేసుకున్న తీరును గమనించాలంటున్నారు. ప్రతి పక్ష హోదాను పరిపూర్ణంగా పోషిస్తేనే ప్రజలు మరోమారు నమ్ముతారని, మనకెందుకులే అనుకుంటే పుట్టిమునిగి పోతుందని పేర్కొంటున్నారు. కనీసంగా అసెంబ్లీ సమా వేశాల్లోనైనా పాల్గొని సర్కార్ విసిరే సవాళ్లను తిప్పికొడ్తే ప్రజల్లోకి పాజిటివ్ మెసేజ్ పోతుందని సూచి స్తున్నారు. బోడిగుండుకు, మోకాలికి ముడిపెట్టినట్టుగా కూతురు కవిత బెయిల్ కు పార్టీ కార్యక్రమాలకు లింక్ పెట్టుకున్నట్టుగా వ్యవహరించడం మంచిదికాదంటు న్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్కటంటే ఒక్కసీటు కూడా దక్కకపోవడంతో తీవ్ర నిస్పృహలో ఉన్నమాట గమనించదగ్గదే అయినా అదే సాకుగా ఇంటికే పరిమితం అవుతుండడంతో జనాల్లో నవ్వులపాలయ్యే ప్రమాదం ఉందని వాపోతున్నారు.

మరోవైపు రాష్ట్రంలో రేవంత్ సర్కార్ సంక్షేమ పథకాలు వేగవంతం చేస్తుండడంతో బీఆర్ ఎస్ శ్రేణులకు ఇంకా మింగుడు పడని పరిస్థితి దాపురిస్తోందని పలువురు విశ్లేషకులు వాపోతున్నారు. అధినేత మౌనంగా ఉండడంతో కాంగ్రెస్ అభివృద్ధి చూసి బీఆర్ ఎస్ ఎమ్మెల్యే వలసలు పెరుగుతున్నాయనేవారు లేకపో లేదు. ఇప్పటికే పదిమంది ఎమ్మెల్యేలను కోల్పోయి పుట్టెడు కష్టాల్లో ఉందని, పార్టీని ఇంకా నిర్లక్ష్యం చేస్తే విలీనం దిశగా జారుకునే ప్రమాదం పొంచి ఉందని సీనియర్ నేతలు సూచిస్తున్నారు.

### స్థానికం వరకైనా...

కవితకు బెయిల్ వచ్చిన తర్వాతే పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఇష్టపడుతున్నట్టు తెలుస్తుండడంతో పార్టీ ముఖ్యులు పెదవి విరుస్తున్నారు. కనీసం 170 రోజులుగా కూతురును కూడా పలకరించకుండా కేవలం ఇంటికే పరిమితమైన నాయకుడు జరుగుతున్న నష్టాన్ని పూడ్చడానికి ఇంకెంత సమయం తీసుకుంటా డోనని అంటున్నారు. మరోవైపు స్థానిక సమరానికి ప్రభుత్వం శంఖారావం పూరించేందుకు ఉవ్విళ్లూరు తోంది. సమయం కూడా ఆసన్నమైంది. ఇప్పటి నుంచైనా కేసీఆర్ ప్రజల్లోకి వచ్చి బీఆర్ఎస్ శ్రేణులకు ధైర్యం నింపకుంటే రాబోయే కాలంలో గ్రామస్థాయిలో పటిష్టంగా ఉన్న స్థితి నుంచి పతనానికి దారి తీసే ప్రమాదం ఉందని విశ్లేషకులు, ఆ పార్టీ శ్రేణులే స్వయంగా పేర్కొంటున్నాయి. కేసీఆర్ ప్రజల్లోకి ఎప్పు డొస్తారు.., పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం ఎప్పుడు నింపుతాడో చూడాలి మరి...

## కేజ్రీవాల్, కవిత జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు



జనపదం, న్యూ ఢిల్లీ : మద్యం పాలసీ కేసులో సీఎం అరవింద్ కేజ్రీవాల్, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత జ్యుడీషియల్ కస్టడీని కోర్టు సెప్టెంబర్ 2 వరకు పొడిగించింది. కేజ్రీవాల్, కవితలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యేక న్యాయమూర్తి కావేరి బవేజా ఎదుట హాజరు పరిచారు. అయితే వీరిద్దరి జ్యుడీషియల్ కస్టడీలను సెప్టెంబర్ 2వ తేదీ వరకు పొడిగించారు. మద్యం పాలసీ కేసుకు సంబంధించిన కేసులో కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు గతంలో మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అయితే, సీబీఐ కేసులో ప్రస్తుతం ఆయన జ్యుడీషియల్ కస్టడీలో తీహార్ జైలు ఉన్నారు.



## రూపాల్ రెడ్డి...

- ఏసీబీ వలలో జాయింట్ కలెక్టర్ భూపాల్ రెడ్డి..
- రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడిన సీనియర్ అసిస్టెంట్ మధుమోహన్ రెడ్డి
- సార్ పంపిస్తేనే వచ్చానన్న సీఏ
- రూ.8 లక్షలతో అడ్డంగా బుక్

**జనపదం, రంగారెడ్డి:** రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ భూపాల్ రెడ్డి రూపాల్ రెడ్డిగా మారారు. ధరణిలో పని చేసి పెట్టేందుకు రూ.8లక్షలు డి మాండ్ చేశాడు. చివరకు పాపం పండి ఏసీబీకి చి క్కి జైలు ఊసలు లెక్కిస్తున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. రం గారెడ్డి జిల్లా జాయిం ట్ కలెక్టర్ భూ పాల్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ మదన్ మోహన్‌రెడ్డి ఏసీబీ అధికా రులకు చిక్కారు. జక్కిడి ముత్యం రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఏసీబీ, ట్రాప్ చేసి జా యింట్ కలెక్టర్, సీని యర్ అసిస్టెంట్‌ను పట్టు కుం ది. ఈ మేరకు వారిని అధికా రులు అరెస్టు చేశారు.

### ఇది కథ..

ధరణి నిషేధిత జాబితా లోంచి 14 గుంటల భూమిని తొలగించేందుకు బాధితుడి 8 లక్షల రూ పాయలు డిమాండ్ చేశారు. సీనియర్ అసిస్టెంట్ మదన్ మోహన్‌రెడ్డి బాధితుడి నుంచి కారులో డబ్బు తీసుకుం టుండగా ఏసీబీ అధికారులు పట్టుకోవడంతో జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకే తీసు కున్నట్లు వెల్లడించారు. అక్కడికక్కడే నిందితుడితో జాయింట్ కలెక్టర్‌కు ఏసీబీ అధికా రులు ఫోన్ చేయించగా పెద్ద అంబర్‌పేట్ ఓఆర్ఆర్ వద్దకు తీసుకురావాలని వెల్లడిం చారు. మదన్ మోహన్‌రెడ్డి డబ్బులు ఇస్తుండగా జాయింట్ కలెక్టర్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. దీంతో నాగోల్‌లోని జాయింట్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి ఇంట్లో సోదాలు చేసి రూ.16 లక్షల నగదు, కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు.

### ఏసీబీ నుంచి తప్పించుకోలేరు..

అవినీతికి పాల్పడే అధికారులు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఏసీబీ నుంచి తప్పించుకో లేరని తెలంగాణ ఏసీబీ డీజీ సీవీ ఆనంద్ హెచ్చరించారు. సోమవారం రాత్రి రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కు చెందిన జాయింట్ కలెక్టర్ ఎంవీ భూపాల్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ మదన్ మోహన్ రెడ్డి రూ.8 లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారు లకు చిక్కిన విషయాన్ని షేర్ చేస్తూ ఎక్స్ ఖాతాలో సీవీ ఆనంద్ ట్వీట్ చేశారు. 14 గుంటల భూమిని ధరణి పోర్టల్‌లో నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించేం దుకు సీనియర్ అసిస్టెంట్ లంచం తీసుకుంటుండగా పట్టుబడ్డారు. తదుపరి ఆ మొత్తాన్ని జాయింట్ కలెక్టర్‌కు అందచేశారు. ఫిర్యాదుదారుని నుంచి నగర శివార్లలో డబ్బు తీసుకోవటం.. ఆపై ఓఆర్ఆర్ దగ్గర జాయింట్ కలెక్టర్‌కు అందేలా జాగ్రత్త తీసుకున్నప్పటికీ, ఏసీబీ టీమ్ రాత్రంతా ఎంతో చాకచక్యంగా అప్పటికప్పుడు ప్రణాళి కలు మార్పు చేసుకుంటూ ఇద్దరిని ట్రాప్ చేశారని సీవీ ఆనంద్ ట్వీట్‌లో పేర్కొన్నారు.



## రాష్ట్రానికి జ్వరమొచ్చింది..!

### ప్రతీ ఇంట్లో జ్వర పీడితులు

**జనపదం, బ్యూరో:** వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రజలను వేధిస్తున్నాయి. ప్రతీ ఇంట్లో జ్వర బాధితులు కనిపిస్తున్నారు. జర్వం, జలుబు, గొంతు నొప్పి, దగ్గు, వాంతులు, విరేచనా లతో జనం ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు.. ఏ హాస్పిటల్ చూసినా వైరల్ ఫీవర్ బాధితులతో కిక్కిరిసిపోతోంది. ప్రతి ఇంటి నుంచి ఒక్కరైనా వైరల్ ఫీవర్ బాధితులుంటున్నారు. వర్షా కాలం.. కొన్ని రోజులుగా వాతావరణం ముసురుగా ఉండటంతో విష జ్వరాల సంఖ్య భారీగా పెరిగి పోయింది. పది రోజులుగా పలు రకాల జ్వరాల బారిన పడుతున్న వారి సంఖ్య ఆందోళన కలిగిస్తోంది. ఒక్క ఫీవర్ హాస్పిటల్ లోనే రోజుకు 600 నుంచి 700 వరకు ఓపీ ఉంటోంది. సాధారణ రోజుల్లో ఇక్కడ 300 నుంచి 400 మంది మాత్రమే వస్తుంటారు. సీజన్ మార్పుల కారణంగా ఈ సంఖ్య సుమారు ఐదు రెట్లు పెరిగింది. ఇక ఇన్ పేషెంట్‌గా చేరుతున్న వారి సంఖ్య రోజుకు 30 నుంచి 40 వరకు ఉంటోంది.. వీరిలో ఎక్కువగా హెపటైటిస్, చికెన్ గున్యా, డెంగ్యూ, విష జర్వాల బాధితులు ఉంటున్నారు. ఒక్క ఫీవర్ హాస్పిటల్‌లో మాత్రమే కాదు ఉస్మానియా, గాంధీ, నీలోఫర్ హాస్పిటల్స్ లలో కూడా వైరల్ ఫీవర్స్ బాధితుల సంఖ్య పెరిగింది. ప్రతి హాస్పిటల్ రోజు ఉండే సాధారణ ఓపీ కన్నా 500 వందల మంది వరకు ఎక్కువ ఒపి ఉంటోంది. పెరిగిన ఓపీ మొత్తం కూడా వైరల్ ఫీవర్స్ బాధితులేనని వైద్యులు చెబుతున్నారు. దగ్గు, జలుబు, గొంతు నొప్పి, జ్వరం వంటి లక్షణాలు ఉంటే ప్రజలు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఆస్పత్రికి వెళ్లి చికిత్స తీసుకో వాలని సూచిస్తున్నారు.

# సుంకిశాలను శంకించాల్సిందే..!

- పనులు కాకముందే ఎందుకు ఓపెన్ చేశారు..?
- నష్టాన్ని ఎవరు భరిస్తారు..
- రూ.2వేల కోట్లు చిన్నవిషయమా..?
- మెఘా కంపెనీని బ్లాక్ లిస్టులో పెట్టాలి..
- కాంట్రాక్టర్ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది..
- సంకిశాల ప్రాజెక్ట్ ను సందర్శించిన బీజేపీ ఎమ్మెల్యేలు



**స్పాట్ వాయిస్, నల్లగొండ:** నల్గొండ జిల్లా సుంకిశాల ప్రాజెక్టు పంప్ హౌస్ రిటైనింగ్ వాల్ ఈ నెల 2వ తేదీన నిర్మాణం జరుగుతున్న క్రమంలో కూలిపోయింది. దీనిపై కాంగ్రెస్, బీఆర్ఎస్ విమర్శ లతోనే సరిపెట్టుకున్నాయి. ప్రాజెక్ట్ సందర్శన వంటి కార్యాచరణను హస్తం, గులాబీ పార్టీలు ప్రకటించనే లేదు. బీఆర్ఎస్ హయాంలో శంకుస్థాపన, కాంగ్రె స్ హయాంలో గోడ కూలిపోవడంతో కమల దళం తమకు అనుకూలంగా మార్చుకునే పనిలో పడింది. ఈ రెండు పార్టీలు ఒక్కటే అనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందు లో భాగంగా మంగళవారం బీజేపీ ఎమ్మెల్యేలు సుంకిశాల ప్రాజెక్ట్ ను సందర్శించారు. బీజేపీ ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, రామారావు పటేల్, పాల్వాయి హరీశ్, ఎమ్మెల్సీ ఏవీఎన్.రెడ్డి బృందం బయల్దేరి వెళ్లింది. బీజేపీ ఎమ్మెల్యేల బృందం కూలిన పంప్ హౌస్ రిటైనింగ్ వాల్‌ను పరిశీలించారు. కూలిపోవడానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

### ఎందుకు దాచిపెట్టారు..?

సుంకిశాల ఘటన జరిగి 12 రోజులు అవుతున్నా ప్రభుత్వం ఎందుకు గోప్యంగా ఉంచిందని బీజేపీ శాసన సభాపక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రశ్నించారు. సుంకిశాల ఘటన అందరూ విస్తుపో యేలా చేసిందని, సోషల్ మీడియాలో వచ్చే వరకు ఎందుకు గోప్యంగా ఉంచారని మండిపడ్డారు. రూ.1500 కోట్ల అంచనా అంటూ 2215 కోట్లకు ఎందుకు పెంచారని ప్రశ్నించారు. పనులు పూర్తికా కముందే టన్నెల్ ఎందుకు ఓపెన్ చేయాల్సి వచ్చిం దన్నారు. తమ అనుమతి తీసుకోకుండానే టన్నెల్ ఓపెన్ చేశారని అధికారులు అంటున్నారని, ఈ ఘటనపై ఘటనపై త్రిమెన్ కమిటీ వేశారు నివేదిక అందిందా లేదా అని నిలదీశారు. పునర్నిర్మాణ ఖర్చులు ఎవరు భరిస్తారని, అతి చిన్న ప్రమాదం అంటూ మంత్రులు ఉత్తమ్, తుమ్మల అంటున్నా రని, రెండు వేల కోట్ల ప్రజా ధనం చిన్న విషయమా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మెఘా కంపెనీ పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలన్నారు. అధికారుల అనుమతి లేకుండా గుత్తేదారు టన్నెల్ ఓపెన్ చేశారని, దీనికి ఎవరు బాధ్యత వహిస్తారన్నారు. అతి చిన్న నష్టం జరిగిందని మంత్రులు చెబుతున్నా రని, ఎలాంటి నివేదిక రాకుండానే అతి చిన్న నష్టం వాటిల్లిందని ఎలా చెప్పగలరన్నారు. షిఫ్ట్ బంద్ కావడం వల్ల వందలాది ప్రాణాలు కాపాడుకోగలి గామన్నారు. లేకపోతే వందలాది మంది ప్రాణాలు కోల్పోయేవారని వాపోయారు. మెఘా కంపెనీ నాసిరకం పనులు చేస్తుందని ముఖ్యమంత్రి కాక ముందు రేవంత్ రెడ్డి అనేకసార్లు ఆరోపించి, ఇప్పుడు మెఘా కంపెనీకే ప్రాజెక్టులు కట్టబెట్టుతు న్నారని విమర్శించారు.

### కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే ఈ గోడ కూలిపోయిందని ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ ఆరోపిం చారు. కాంట్రాక్టర్ లైసెన్స్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని కాంట్రాక్టును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సుంకిశాల గోడ కూలిన ఘటనపై ప్రభుత్వం గోప్యత వహిస్తుందని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ మండిపడ్డారు. ఎవ్వరూ చనిపోలేదని చెబుతున్న తమకు అనేక అనుమానాలు కలుగుతు న్నాయన్నారు. ప్రభుత్వంతో కాంట్రాక్టర్ లోపాయి కారీ ఒప్పందం ఉందని ఆరోపించారు. ప్రభుత్వా నికి చిత్త శుద్ధి ఉంటే సీబీఐ విచారణకు అదేశించా లని డిమాండ్ చేశారు. ప్రాజెక్టుల్లో నాసిరకం పనులు చేస్తే దీనికి ఎవ్వరూ బాధ్యత వహించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్. రెడ్డి ప్రశ్నించారు. ప్రాజెక్టు ప్రారంభించిన తర్వాత సంవత్సరానికే 700 కోట్ల అంచనా వ్యయాన్ని పెంచారని పేర్కొన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

## జూడాపై హత్యాచారం కేసు సీబీఐకి

**జనపదం, బ్యూరో:** బంగాల్‌లో జూనియర్ డాక్టర్ హత్యాచారం కేసు విచారణ విషయంలో కలకత్తా హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. కేసు దర్యాప్తును సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ)కి బదిలీ చేయాలని పోలీసులను ఆదేశించింది. మంగళవారం సాయంత్రంలోపు కేసు డైరీని, బుధవారం ఉదయం 10 గంటలలోపు కేసుకు సంబంధించిన డాక్యుమెంట్లు, సీసీటీవీ ఫుటేజీ సీబీఐకి అప్పగించాలని ఆదేశా లు జారీ చేసింది. అంతేకాకుండా తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకూ సందీప్ ఘోష్‌ను ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా తిరిగి నియమించొద్దని హైకోర్టు పేర్కొంది. కాగా, డాక్టర్లు నిర్వర్తించేది గౌరవమైన బాధ్యత అని, నిరసనలు ఆపాలని వైద్యులను కోరింది. హత్యాచార ఘటనకు నిరసనగా దేశవ్యాప్తంగా అత్యవసర సేవలు మినహా విధులను వైద్య సిబ్బంది బహిష్కరించిన నేపథ్యంలో హైకోర్టు ఈ మేరకు విజ్ఞప్తి చేసింది. ఇదిలా ఉంటే వైద్యులపై హింసను అరికట్టేందుకు, ఆస్పత్రుల్ని సేఫ్‌జోన్లుగా ప్రకటించాలని ఐఎంఏ నడ్డాకు లేఖ రాసింది. 25 రాష్ట్రాలు వైద్యులపై దాడులను నిరో ధించేందుకు ప్రత్యేక చట్టాలు చేసినా క్షేత్రస్థాయిలో అవి క్రియాశీలకంగా లేవని, కేంద్రం ప్రత్యేక చట్టం చేయకపోవడం అందుకు కారణమని లేఖలో వివరించింది.

# ఎన్నాళ్లకెన్నాళ్లకు...

- కాంగ్రెస్ పెద్దల్లో పంద్రాగస్టు సంబురం..
- జెండా ఎగురేసే నేతల జాబితా విడుదల..
- గోల్కొండలో సీఎం రేవంత్ రెడ్డి
- జిల్లా కేంద్రాల్లో మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు, కార్పొరేషన్ల చైర్మన్లు..

**జనపదం, హైదరాబాద్ :** తెలంగాణలో పంద్రాగస్టు వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున అధికారికంగా గోల్కొండ కోటపై సీఎం రేవంత్ రెడ్డి జాతీయ జెండాను ఎగురవేయనున్నారు.జిల్లా కేంద్రాల్లో మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు, కార్పొరేషన్ల చైర్మన్లు జాతీయ జెండాలను ఎగురవేయనున్నారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

**జిల్లా కేంద్రాల్లో జాతీయ ఎగురవేసేది వీరే..**

- ఆదిలాబాద్ : మహ్మద్ అలీ షబ్బీర్, ప్రభుత్వ సలహాదారు
- భద్రాద్రి కొత్తగూడెం : మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు
- హనుమకొండ : మంత్రి కొండా సురేఖ
- జగిత్యాల : ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్
- భూపాలపల్లి : పోదెం వీరయ్య
- జనగామ : ప్రభుత్వ బీర్ల ఐలయ్య
- జోగులాంబ గద్వాల్ : ఏపీ జితేందర్ రెడ్డి
- కామారెడ్డి : పటేల్ రమేశ్ రెడ్డి
- కరీంనగర్ : మంత్రి శ్రీధర్ బాబు
- ఖమ్మం : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- కుమ్రంభీం ఆసిఫాబాద్ : బండా ప్రకాశ్ మండలి డిప్యూటీ చైర్మన్
- మహబూబాబాద్ : విప్ రామచందర్ నాయక్
- మహబూబ్‌నగర్ : మంత్రి జూపల్లి కృష్ణారావు
- మంచిర్యాల : హరకర వేణుగోపాల్
- మెదక్ : కే కేశవరావు ప్రభుత్వ సలహాదారు
- మేడ్చల్ : పట్నం మహేందర్ రెడ్డి
- ములుగు : మంత్రి సీతక్క
- నాగర్‌కర్నూల్ : జి.చిన్నారెడ్డి
- నల్లగొండ : మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి
- నారాయణపేట : గుర్నాథ్ రెడ్డి
- నిర్మల్ : రాజయ్య సిరిసిల్ల
- నిజామాబాద్ : అనిల్ ఎరవత్రి
- పెద్దపల్లి : నేరెళ్ల శారద
- రాజన్న సిరిసిల్ల : ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- రంగారెడ్డి : వేం నరేందర్ రెడ్డి
- సంగారెడ్డి : మంత్రి దామోదర రాజనర్సింహ
- సిద్దిపేట : మంత్రి పొన్నం ప్రభాకర్
- సూర్యాపేట : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- వికారాబాద్ : స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్
- వనపర్తి : ప్రీతం
- వరంగల్ : మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- యాదాద్రి భువనగిరి : గుత్తా సుఖేందర్ రెడ్డి మండలి చైర్మన్

# కరప్షన్.. కలెక్షన్.. కాంగ్రెస్

- ఇదే హస్తం పార్టీ విధానం
- స్పెషల్ సెంటర్లు పెట్టి ప్రజలను పీడిస్తున్నరు..
- రైతుల విశ్వాసం కోల్పోయిన సర్కారు
- రూ.లక్ష రుణ మాఫీ కాని వారే ఇంకా లక్షల సంఖ్యలో ఉన్నారు..
- మూడో విడత రుణమాఫీ తరువాత మంత్రులు తిరిగే పరిస్థితి ఉండదు..
- వార్తాపత్రికల్లో హెడ్ లైన్ల కోసమే మంత్రులు మాటలు
- హరీష్ రావును విమర్శించే నైతిక అర్హత పొన్నంకు లేదు..
- నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి




**జనపదం, హైదరాబాద్ :** కాంగ్రెస్ కు క రప్షన్, కలెక్షన్లు అలవాటేనని, అన్ని చోట్ల ప్రత్యేక సెంటర్లు పెట్టి ప్రజలను పీడిస్తున్నారని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. రియల్టర్లు, రవాణా శాఖ, పౌరసరఫరాలు తదితర శాఖలపై కన్నేసి వసూళ్లకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. మంగళవారం హైదరాబాద్ తెలంగాణ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల పక్షాన హరీష్ రావు మాట్లాడితే మంత్రి పొన్నం సహా మిగతా మంత్రులు పిచ్చి కూతలు కూస్తున్నారని, కేవలం వార్తాపత్రికల్లో హెడ్ లైన్లలో ఉండేందుకు వ్యాఖ్యలు చేయడం దురదృష్టకమన్నారు. రూ.31 వేల కోట్లతో రుణ మాఫీ చేస్తామని, రూ. 18 వేల కోట్లతో మమ అనిపించే ప్రయత్నం జరుగుతోందన్నారు. మా కాల్ సెంటర్ కు రుణ మాఫీ పై ఇప్పటికే 75 వేల కు పైగా ఫిర్యాదులు వచ్చాయని, పంద్రాగస్టున మూడో విడత రుణ మాఫీ అంటున్నారని, ఆ తరువాత కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు గ్రామాల్లో తిరగని పరిస్థితి ఉంటుందన్నారు. రూ.లక్ష రుణ మాఫీ కాని వారే ఇంకా లక్షల సంఖ్యలో ఉన్నారని, రుణ మాఫీ కానీ రైతుల పక్షాన కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ ఎస్ పార్టీ పోరాడుతుందన్నారు. చేయని తప్పులకు రైతులను సహకార సంఘాలను ప్రభుత్వం బాధ్యులను చేస్తోందని, నల్లబెల్లి మండలంలో రైతులు, సహకార సంఘాలను క్రిమినల్స్ లాగా చిత్రీకరిస్తూ కేసులు నమోదు చేస్తున్నారని వాపోయారు.

**ప్రజలను పీడిస్తున్నరు..**

రవాణా శాఖలో ప్రతి జిల్లాకు రూ. కోటి అక్రమంగా వసూలు చేస్తున్నారని, పౌర సరఫరాల శాఖలో 1832 కలెక్షన్ సెంటర్లు పెట్టి మిల్లర్లను వేధిస్తున్నారని, బిల్డర్ల నుంచి చదరపు అడుగుకు రూ.75 వసూలు చేస్తున్నారని, ఇలా అన్ని దిక్కులా, అన్ని చోట్ల కలెక్షన్ సెంటర్లు పెట్టి ప్రజలను పీడిస్తు న్నారని పెద్ది సుదర్శన్ ఆరోపించారు. కేసీఆర్ చేసిన మంచి పనులను ఆస్వాదిస్తూ అప్పుల నెపాన్ని నెడుతున్నారని, అప్పులపై తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు. కేసీఆర్ హయాంలో రూ.3 లక్షల 24 వేల కోట్ల అప్పు మాత్రమే అయిందని హరీష్ రావు గణాంకాలతో సహా చెప్పారని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎనిమిది నెలల్లోనే రూ.50 వేల కోట్ల అప్పు చేసిందన్నారు. రూ.లక్ష రుణ మాఫీ కాని వారే ఇంకా లక్షల సంఖ్యలో ఉన్నారని, అన్నదాతలను పట్టించుకోనే ప్రభుత్వం రైతుల విశ్వాసం కోల్పోయిందన్నారు. రైతుల కోసం మాట్లాడితే హరీష్ రావుపై పొన్నం చేస్తున్న పిచ్చి కూతలు బంద్ చేయాలన్నారు. మాకు సమాధానం చెప్పే ధైర్యం సీఎంకు మంత్రుల దగ్గర లేదన్నారు.

**విచారణ కు సిద్ధమా ?**

పొన్నం బాధ్యత వహించే రవాణా శాఖలో జరుగుతున్న అవినీతిపై సోనియాకు ఫిర్యాదులు వెళ్లాయని, సీఎం పీఏ ట్రాన్స్ పోర్టు శాఖలో దందాలు చేస్తున్నారని, దీనిపై మంత్రి విచారణ కు సిద్ధమా ? అని డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ సూటిగా ప్రశ్నించారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావుపై పొన్నం బురద జల్లడం తప్ప చేస్తున్నదేమీ లేదన్నారు. రవాణా శాఖలో అవినీతి లేదని పొన్నం శ్వేత పత్రం ఇవ్వగలడా అని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో ఒక్క బస్సు కొనలేదని అంటున్న పొన్నం డిసెంబర్ 7 న అధికారంలోకి వచ్చిన తక్కువ వ్యవధిలో బస్సులు కొనడం ఎలా సాధ్యమైందన్నారు. కేసీఆర్ హయాంలో ఎన్ని బస్సులు కొన్నారో సజ్జనార్ ను అడిగితే చెబుతారన్నారు. 500 ఎలక్ట్రిక్ బస్సులను ప్రైవేటు సంస్థలు ఓలెక్ట, జేబీఎం సంస్థలకు ధారాదత్తం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆరోపించారు. కొన్ని డిపో లను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రైవేటు పరం చేసిందన్నారు. ఆర్టీసీలో కలెక్షన్ల దందా నడుస్తోందని, ఆర్టీసీ బస్సులను ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టడంలో భారీగా అవినీతి జరిగిందని, దీనిపై సీబీ సీఐడీ దర్యాప్తునకు సిద్దమా అన్నారు. లాభాల్లో ఉన్న ఆర్టీసీని నష్టాల్లోకి నెట్టారని, మిగులు బడ్జెట్ తో సంస్థను అప్పగిస్తే రూ.2100 కోట్ల నష్టానికి చేర్చారన్నారు. పొన్నం ప్రభాకర్ పిచ్చి విమర్శలు మాని తన శాఖ మీద దృష్టి పెడితే మంచిదని హితవు చెప్పారు.

# పది రోజుల్లోనే ఫస్ట్ స్టెప్..

- కాగ్నిజెంట్ విస్తరణకు ముహూర్తం ఫిక్స్..
- ఈ నెల 5న న్యూజెర్సీలో రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు..
- అనుకున్నట్టుగానే తొలి అడుగు..
- సీఎం చేతుల మీదుగా రేపు కంపెనీ విస్తరణకు శ్రీకారం
- హాజరుకానున్న సీఈవో రవికుమార్
- విస్తరణతో మరో 15 వేల మందికి ఉపాధి
- హైదరాబాద్‌లో ఇప్పటికే ఐదు క్యాంపస్‌లు
- 57 వేల మందికి ఉద్యోగ అవకాశం



**జనపదం, హైదరాబాద్ :** ప్రముఖ ఐటీ దిగ్గజ సంస్థ కాగ్నిజెంట్ కాగ్నిజెంట్ విస్తరణకు ముహూర్తం ఖరారైంది. హైదరాబాద్ లో కొత్త క్యాంపస్ కు బుధవారం శంకుస్థాపన చేయనుంది. అమెరికా, దక్షిణ కొరియా పర్యటన ముగించుకొని హైదరాబాద్ రానున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ కంపెనీ విస్తరణకు శ్రీకారం చుట్టనుండగా, కాగ్నిజెంట్ సీఈవో రవికుమార్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఇది ఇలా ఉంటే రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అమెరికా పర్యటనలో భాగంగా కాగ్నిజెంట్ కంపెనీ సీఈవో రవికుమార్ తో చర్చలు జరిపారు. న్యూజెర్సీలో ఈనెల 5వ తేదీన రాష్ట్ర ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందానికి అనుగుణంగా కాగ్నిజెంట్ కంపెనీ పది రోజుల్లోనే కొత్త క్యాంపస్ విస్తరణకు శ్రీకారం చుట్టింది. ఒప్పందంలో భాగంగా తమ కంపెనీ విస్తరణ ప్రణాళికలను ముందుగానే వెల్లడించింది. హైదరాబాద్ లో 10 లక్షల చదనపు అడుగుల కొత్త క్యాంపస్ నెలకొల్పుతామని, అదనంగా 15 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయని ప్రకటించింది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డిజిటల్ ఇంజనీరింగ్, క్లౌడ్ సొల్యూషన్స్‌తో సహా వివిధ అధునాతన సాంకేతికతలపై కొత్త క్యాంపస్ ఫోకస్ చేస్తుంది. ఒప్పందంలో భాగంగా తమ కంపెనీ విస్తరణ ప్రణాళికలను ముందుగానే వెల్లడించింది. హైదరాబాద్ లో 10 లక్షల చదనపు అడుగుల కొత్త క్యాంపస్ నెలకొల్పుతామని, అదనంగా 15 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయని ప్రకటించింది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డిజిటల్ ఇంజనీరింగ్, క్లౌడ్ సొల్యూషన్స్‌తో సహా వివిధ అధునాతన సాంకేతికతలపై కొత్త క్యాంపస్ ఫోకస్ చేస్తుంది. ఇది ఇలా ఉంటే 1994లో చెన్నై కేంద్రంగా ఆవిర్భవించిన కాగ్నిజెంట్ ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. హైదరాబాద్‌లో 2002 నుంచి కార్యకలాపాలు ప్రారంభించింది. ఐటీ కారిడార్‌లోని వివిధ ప్రాంతాల్లో ఐదు క్యాంపస్‌లు ఉన్నాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లో దాదాపు 57 వేల మంది ఉద్యోగులున్నారు. రాష్ట్రంలో ఐటీ రంగంలో అత్యధిక ఉద్యోగాలు కల్పిస్తున్న రెండో సంస్థగా కాగ్నిజెంట్‌కు పేరుంది. గడిచిన రెండేండ్లలో ఈ కంపెనీ రాష్ట్రంలోని 34 వివిధ విద్యా సంస్థల నుంచి 7500 మంది ఫ్రెషర్లకు ఉద్యోగాలు ఇచ్చింది. గత ఆర్థిక సంవత్సరంలో కాగ్నిజెంట్ కంపెనీ తెలంగాణ నుంచి రూ. 7725 కోట్ల ఐటీ ఎగుమతులను నమోదు చేసింది. గడిచిన అయిదేండ్లలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ కింద ఈ కంపెనీ రూ. 22.5 కోట్లతో వివిధ సామాజిక కార్యక్రమాలు చేపట్టింది.

# ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టుపై దృష్టి సారించాలి..

- రీజినల్ రింగ్‌రోడ్డు భూసేకరణకు ప్రాధాన్యం ఇవ్వాలి..
- వచ్చే నెల రెండో వారంలో పూర్తి చేయాలి
- కలెక్టర్లకు సీఎస్ శాంతికుమారి ఆదేశం



**జనపదం, బ్యూరో :** హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డు (హెచ్ ఆర్ ఆర్ ఆర్ ) ప్రాజెక్టు రాష్ట్రంలోనే ప్రాధాన్యం సంతరించుకుందని, దానిపై దృష్టి సారించాలని సీఎస్ శాంతికుమారి ఆదేశాలు జారీ చేశారు అందుకు అవసరమైన భూసేకరణ కార్యక్రమానికి ప్రాధా న్యం ఇచ్చి సెప్టెంబర్ 2వ వారం లోగా పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆయా జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణ పనుల పురోగతిపై మంగళవారం సచివాలయంలో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు.ప్రతిష్టాత్మక ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టు కు సంబంధించి వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ప్రత్యేక దృష్టి సారించి, భూములు కోల్పోతున్న రైతులకు న్యాయపరమైన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూములు కోల్పోతున్న రైతులకు సరైన పరిహారం అందేలా జిల్లాస్థాయిలో కలెక్టర్ల అధ్యక్షతన కమిటీలను ఏర్పాటు చేసి భూముల మార్కెట్ విలువ ఆధారంగా పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. కోర్టు కేసులపై సైతం ప్రత్యేక చొరవ తీసుకుని త్వరితగతిన పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు. సమీక్షకు రోడ్లు భవనాలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ప్రభుత్వ సలహాదారు శ్రీనివాస్ రాజు, రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవిన్ మిట్టల్, అటవీశాఖ అడిషనల్ సెక్రటరీ ప్రశాంతి, ఆర్‌అండ్‌బీ శాఖ ప్రత్యేక కార్యదర్శి హరిచందన, సంయుక్త కార్యదర్శి హరీష్, రంగారెడ్డి, మెదక్, సంగారెడ్డి, యాదాద్రి, సిద్దిపేట జిల్లాల కలెక్టర్లు హాజరయ్యారు

# కారం మెతుకులే గతి..

- ఖాళీ కడుపులతో చదువులు..
- దిగజారిన గురుకులాల పరిస్థితి..
- కనీస వసతులు కరువు..
- పట్టించుకోని ప్రభుత్వం..
- మాజీ మంత్రి హరీశ్ రావు



**జనపదం, హైదరాబాద్:** రాష్ట్రంలోని ఐటీఐ కాలేజీలు, గురుకులాల్లో కనీస వసతులు లేవని, మెనూ ప్రకారం భోజనం పెట్టకపోవడం, పెట్టిన ఆహారం నాణ్యతగా లేకపోవడంతో విద్యార్థులు దిక్కులేక కారం మెతుకులతో కడుపులు నింపుకుంటున్నారని, అయినా సర్కారులో చలనం లేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు వాపోయారు. పెద్దపల్లి, సంగారెడ్డి, అదిలాబాద్.. ఇలా రాష్ట్రంలో ఎక్కడి ఐటీఐల పరిస్థితి చూసినా అధ్వాన్నంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుద్ధ్య నిర్వహణ లేక, టాయిలెట్స్, అవసరమైన సిబ్బంది లేక విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నారని చెప్పారు. లైబ్రరీలో కంప్యూటర్లు, ఇతర యంత్రాలు, పనిముట్లు పనిచేయడం లేదన్నారు. దీంతో విద్యార్థులు ప్రాక్టికల్స్ చేయలేకపోతున్నారని వెల్లడించారు. కొన్ని చోట్ల ఐటీఐ తరగతుల్లోకి వాన నీరు చేరి ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.కలుషిత ఆహారంతో విద్యార్థుల అస్వస్థత, పాము కాటుకు విద్యార్థి మృతి, డెంగీ జ్వరంతో విద్యార్థి దుర్మరణం వంటి వార్తలు నిత్యకృత్యం అయ్యాయని ఆవేదన వ్యక్తంచేశారు. సరిపడా బాత్‌రూంలు లేక, ఉన్నవాటికి డోర్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మెనూ ప్రకారం భోజనం పెట్టడంలేదని, పెడుతున్న భోజనం కూడా నాణ్యంగా ఉండకపోవడంతో కారం అన్నంతో కడుపులు నింపుకుంటున్నారని చెప్పారు. వాటర్ ట్యాంకులు మురికితో పాకురు పట్టి ఉంటున్నాయని, ఆ నీటినే విద్యార్థులు వాడుతుండటంతో చర్మవ్యాధుల బారిన పడుతున్నారని వెల్లడించారు. ఇన్ని సమస్యల మధ్య విద్యార్థులు చదువుపై ఎలా దృష్టి సారిస్తారని ప్రశ్నించారు. గురుకులాల్లో చదివితే విద్యార్థుల భవిష్యత్తు బంగారుమయం అవుతుందని తల్లిదండ్రులు ఎలా నమ్ముతారని నిలదీశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎంతో ప్రఖ్యాతి గాంచిన గురుకులాలు, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దిగజారుతుండటం శోచనీయమన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఐటీఐలు, గురుకులాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, అవసరమైన అన్ని సౌకర్యాలు వెంటనే కల్పించాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు.

# డీఎస్సీ ప్రాథమిక కీ, రెస్పాన్స్ షీట్లు విడుదల

**అభ్యంతరాల కోసం 20వ తేదీ గడువు**

**జనపదం, ఎడ్యుకేషన్ :** రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నిర్వహించిన డీఎస్సీ పరీక్ష ప్రాథమిక కీ లు విడుదలయ్యాయి. కీ తోపాటు అభ్యర్థుల రెస్పాన్స్ షీట్‌లను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. ప్రాథమిక కీ పై అభ్యంతరాలు తెలిపేందుకు ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అవకాశం కల్పించారు. అభ్యర్థుల పేరు, పుట్టిన తేదీ వివరాలు, కులం, ఈడబ్ల్యూఎస్ వంటి వివరాలు తప్పుగా నమోదైనా, టెట్ స్కోర్ మార్పుల కోసం సంబంధించి ధృవపత్రాలను జతచేస్తూ 20వ తేదీ 5 గంటల వరకు helpdesktsdsc2024@gmail.comకు ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవీ నరసింహారెడ్డి సూచించారు. ఈ ఏడాది జులై 18 నుంచి ఆగస్టు 5 వరకు మొత్తం 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం ప్రభుత్వం డీఎస్సీ పరీక్ష నిర్వహించారు. మొత్తం 2,79,957 మంది దరఖాస్తు చేసుకోగా, వారిలో 2,45,263 (87.61 శాతం) మంది అభ్యర్థులు హాజరయ్యారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు 1,61,745 మందికి 1,37,872 (85.24 శాతం), సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్‌జీటీ) పోస్టులకు 88,005కి 81,053 (92.10 శాతం), లాంగ్వేజ్ పండిట్ పోస్టులకు 18,211కు 16,092 (88.36 శాతం), పీఈటీ పోస్టులకు 11,996కు 10,246(85.41 శాతం) మంది హాజరయ్యారు. రాష్ట్రంలో తొలిసారి కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) విధానంలో డీఎస్సీ పరీక్ష నిర్వహించారు.



# బెజ్జూర్ పీఏసీఎస్ ముట్టడి

- రైతుల అకౌంట్లో జమకాని రుణమాఫీ నిధులు
- ఆందోళనలో అన్నదాతలు

**జనపదం, సిర్పూర్ :** బెజ్జూర్ మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘం కార్యాలయాన్ని రైతులు ముట్టడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం డిసెంబర్ 12, 2018 నుంచి డిసెంబర్ 09,2023 మధ్య పంట రుణాలు తీసుకున్న రైతులకు లోన్లు రుణమాఫీ చేసి నిధులు విడుదల చేస్తోంది. అయితే బెజ్జూరు సీఈవో పర్ష సంజీవ్ కుమార్ రైతుల నుంచి డాక్యుమెంట్ తీసుకొని వారి ఖాతాల్లో రుణమాఫీ నగదు జమ చేయకుండా రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని సిర్పూర్ నియోజక వర్గ కాంగ్రెస్ నాయకులు అర్షద్ హుస్సేన్ రైతులతో కలిసి సహకార సంఘం కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం అర్షద్ హుస్సేన్ మాట్లాడుతూ పంట రుణాలు తీసుకున్న రైతులకు అన్ని బ్యాంకులు ప్రభుత్వం నుంచి రుణమాఫీ నిధులు మంజూరైన వెంటనే రైతుల అకౌంట్లో రెండు, మూడు రోజుల్లోనే జమ చేస్తున్నాయన్నారు. కానీ,బెజ్జూర్ మండల సహకార సంఘం కార్యాలయంలో రైతుల అకౌంట్లో రుణమాఫీ నిధులను జమ చేయకుండా రైతులకు తీవ్ర ఇబ్బందుల గురి చేసే రోజుల తరబడి రైతులను కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటున్నారంటూ పోయారు. రెండు, మూడు రోజుల్లో పంట రుణాలు తీసుకున్న రైతుల అకౌంట్లో రుణమాఫీ నిధులు జమ చేయకుంటే రైతులతో పెద్ద ఎత్తున సహకార సంఘం కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.



# తెలంగాణ ఎంప్లాయీస్ రిలీవ్

- ఉత్తర్వులు జారీ చేసిన ఏపీ సర్కారు..
- 122 మంది ఉద్యోగులకు విముక్తి

**జనపదం, హైదరాబాద్ :** తెలంగాణ స్థానికత ఉన్న ఉద్యోగులను ఏపీ ప్రభుత్వం మంగళవారం రిలీవ్ చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర విభజన సమయంలో ఏపీకి కేటాయించిన ఉద్యోగులను తిరిగి వారి స్వరాష్ట్రానికి పంపేలా ఉత్తర్వులు ఇచ్చింది. మొత్తం 122 మంది తెలంగాణ స్థానికత కలిగిన నాన్ గెజిటెడ్ ఉద్యోగులను రిలీవ్ చేస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. తెలంగాణ ప్రభుత్వం నుంచి వచ్చిన అభ్యర్థన మేరకు 122 మంది నాన్ గెజిటెడ్ ఉద్యోగులను తెలంగాణకు రిలీవ్ చేస్తూ ఆదేశాలు ఇచ్చింది. ప్రస్తుతం వేర్వేరు విభాగాల్లో పనిచేస్తున్న తెలంగాణ స్థానికత కలిగిన ఉద్యోగులను రిలీవ్ చేసే ముందు వారి నుంచి అంగీకారం తీసుకోవాలని స్పష్టం చేసింది. తెలంగాణకు రిలీవ్ అవుతున్న ఉద్యోగులు తమ కేడర్‌లోని చివరి ర్యాంక్‌లో మాత్రమే చేరుతారని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# విద్యార్థుల మృతి బాధాకరం

- ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు
- పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేస్తాం..
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- పెద్దాపూర్ గురుకుల విద్యార్థుల తల్లిదండ్రులతో భేటీ

**జనపదం, పెద్దపల్లి ప్రతినిధి :** విద్యార్థుల మృతి బాధాకరమని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. జగిత్యాల జిల్లా మెట్ పల్లి మండలం పెద్దాపూర్ గురుకుల పాఠశాలను మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ఎదుట విద్యార్థుల తల్లిదండ్రులు కంట తడిపెట్టగా, వారిని ఓదార్చారు. ఇటీవల మృతి చెందిన విద్యార్థులు గణాధిత్య, అనిరుధ్ మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈసంఘటనపై పూర్తి వివరాలు పంపించాలని గురుకుల పాఠశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ మహిపాల్ రెడ్డిని విచారించారు. కాగా విద్యార్థుల మృతిపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ చలించిపోయారు. గురుకుల పాఠశాలలో డ్యూటీ నర్స్ సంబంధించిన వివరాలపై ఆరా తీశారు. విద్యార్థులు మృతి చెందిన సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటానని వెల్లడించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ లు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ , మేడిపల్లి సత్యం , సంజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# దేశవ్యాప్తంగా వైద్యుల ఆందోళన..

- ట్రైనీ డాక్టర్ పై హత్యాచార ఘటనపై నిరసన

**జనపదం, బ్యూరో :** పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలో ఆర్‌జీ కార్ మెడికల్ కాలేజీలో ట్రైనీ వైద్యురాలిపై హత్యాచార ఘటనను నిరసిస్తూ వైద్యులు ఆందోళన బాట పట్టారు ఈ నిరసన దేశ వ్యాప్తంగా తీవ్ర దుమారం రేపుతోంది. ది ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (ఫోర్డా) ఆధ్వర్యంలో ప్రభుత్వ దవాఖానల రెసిడెంట్ డాక్టర్లు ఢిల్లీ, కోల్‌కతా, రాజస్థాన్, యూపీ సహా దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతున్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలంటూ డిమాండ్ చేస్తున్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ కోరుతున్నారు. కాగా, దేశవ్యాప్త ఆందోళనతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

# ఓటమి బాధిస్తోంది..

## స్టార్ బాక్సర్ నిఖత్ జరిన్



జనపదం, స్పోర్ట్స్: ఒలింపిక్స్‌లో పతకం సాధిస్తుందనుకున్న స్టార్ బాక్సర్ నిఖత్ జరిన్ నిరాశపర్చింది. ఎన్నో అంచనాలతో బరిలోకి దిగిన నిఖత్ విశ్వ క్రీడల్లో తన పంచ్ పవర్ చూపించలేక నిరాశపరిచింది. నిజామాబాద్‌కు చెందిన నిఖత్ 50 కిలోల విభాగంలో ఒలింపిక్స్ బరిలో నిలిచింది. ఒలింపిక్ ట్రయల్స్‌లో దిగ్గజ బాక్సర్ మేరీ కోమ్‌ను ఓడించిన ఆమె ఈసారి పతకం గెలవడం ఖాయం అనిపించింది. కానీ, అంచనాలు తప్పాయి. అయితే.. తొలి రౌండ్‌లోనే ఆమెకు చైనా బాక్సర్ వూ యూ చెక్ పెట్టింది. దీంతో పోటీ పడేందుకు 50 కిలోల నిర్ణీత బరువు ఉండేందుకు నిఖత్ రెండు రోజులుగా పడ్డ శ్రమ అంతా వృథా అయింది. అనూహ్యంగా తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టింది. ప్రపంచ చాంపియన్‌షిప్ గెలుపొందిన ఇందూరు బిడ్డ ఒలింపిక్స్ మెడల్‌ను మాత్రం అందుకోలేకపోయింది. పారిస్‌లో విశ్వ క్రీడలు ముగిసిన మరునాడే ఈ యువ బాక్సర్ తన బాధను 'ఎక్స్' పోస్ట్ ద్వారా వెల్లడించింది. జీవితం మొత్తాన్ని బాక్సింగ్‌కే కేటాయించానని, ఒలింపిక్స్ ఫలితాన్ని జీర్ణించుకోవడం చాలా కష్టంగా ఉందని నిఖత్ తెలిపింది. పారిస్ ఒలింపిక్స్ ముగిసిన సందర్భంగా చాంపియన్‌గా నిలిచిన ఆమె ప్రత్యర్థి వూ యూకి అభినందనలు తెలిపింది. ప్రస్తుతమైతే జీవిత ప్రయాణాన్ని ఆస్వాదిస్తానని, వచ్చే ఒలింపిక్స్ మీద దృష్టి పెడుతా అని నిఖత్ తన పోస్ట్‌లో రాసుకొచ్చింది.

## బ్యాడ్మింటన్ ప్లేయర్ ప్రమోద్ భగత్ పై

# 18 నెలల నిషేధం



**జనపదం, ఢిల్లీ:** టోక్యో–2020 పారా ఒలింపిక్ క్రీడల్లో స్వర్ణ పతకం గెలిచిన బ్యాడ్మింటన్ ప్లేయర్ ప్రమోద్ భగత్ పై 18 నెలల నిషేధం విధించినట్లు బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ ప్రకటించింది. యాంటీ డోపింగ్ నియమావళిని ఉల్లంఘించినట్లు బీడబ్ల్యూఎఫ్ పేర్కొంది. 12 నెలల వ్యవధిలోనే షట్లర్ భగత్ మూడు సార్లు పరీక్షలో విఫలమైనట్లు కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఆఫ్ స్పోర్ట్ తెలిపింది. దీంతో ప్రమోద్ భగత్.. పారిస్ 2024 పారాఒలింపిక్ గేమ్స్‌కు దూరంకానున్నాడు. భగత్ చేసిన అప్పీల్‌ను సీఏఎస్ అప్పీల్స్ డివిజన్ జూలై 29వ తేదీన రద్దు చేసింది. అనర్హత వేటు తక్షణమే అమలులోకి వస్తుందని సీఏఎస్ తెలిపింది. ఇటీవల థాయ్‌ల్యాండ్‌లో జరిగిన పారా బ్యాడ్మింటన్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో ఎస్ఎల్3 టైటిల్‌ను ప్రమోద్ భగత్ నిలబెట్టుకున్నాడు. ఫైనల్లో అతను ఇంగ్లండ్‌కు చెందిన డానియల్ బేతల్‌ను ఓడించాడు.35 ఏళ్ల భగత్ 14–21, 21–15, 21–15 స్కోరుతో డానియల్‌పై గెలిచాడు. సింగిల్స్‌లో నాలుగుసార్లు ప్రపంచ టైటిల్స్ అతను సొంతం చేసుకున్నాడు. 2015, 2019, 2022లో టైటిల్స్ గెలిచాడు.



# నీరజ్-మనుభాకర్ పెళ్లి..?

### క్లారిటీ ఇచ్చిన మను తండ్రి

**జనపదం, స్పోర్ట్స్:** జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రాను.. షూటర్ మనూ భాకర్ పెళ్లి చేసుకోబోతున్నట్లు సోషల్ మీడియాలో పుకార్లు వ్యాపిస్తున్నాయి. పారిస్ ఒలింపిక్స్‌లో జరిగిన ఓ ఈవెంట్ వేళ.. షూటర్ మనూ భాకర్ తల్లి.. నీరజ్ చోప్రాతో మాట్లాడుతూ కనిపించారు. అంతేకాదు నీరజ్, మనూ కూడా మాట్లాడుకున్నారు. అయితే ఆ ముగ్గురూ మట్లాడుకున్న తీరు.. ఇంటర్నెట్‌లో హాట్ టాపిక్‌గా మారింది. నీరజ్, మనూ పెళ్లి చేసుకుంటారని కొందరు పోస్టులు పెట్టారు. నీరజ్–మను భాకర్‌లో ప్రేమలో ఉన్నారనే వార్తను ప్రచారం చేశారు. తమ కుమార్తెను పెళ్లి చేసుకోవాలని మను భాకర్ తల్లి.. నీరజ్ చేత ఒట్టు వేయించుకుందని కామెంట్లు చేశారు. వాస్తవానికి నీరజ్ చోప్రా–మను భాకర్, నీరజ్ చోప్రా–మను భాకర్ తల్లి ఏం మాట్లాడుకున్నారో తెలియదు గానీ.. సోషల్ మీడియా మాత్రం ఈ విషయంపై రచ్చ చేసింది. అయితే ఆ సోషల్ మీడియా పోస్టులకు షూటర్ మనూ భాకర్ తండ్రి చెక్ పెట్టేశాడు. మనూ భాకర్ కు ఇంకా పెళ్లి ఈడు రాలేదన్నాడు. అంతేకాదు.. తమ కుటుంబం ఆమె పెళ్లి గురించి ఇప్పుడే ఏం ఆలోచించడం లేదని, తన భార్య నీరజ్ చోప్రాతో క్రీడలకు సంబంధించిన విషయాల గురించే మాట్లాడి ఉంటుంది. నీరజ్ చోప్రాను తన బిడ్డలా భావిస్తుందని రామ్ కిషన్ భాకర్ వ్యాఖ్యానించాడు. ఇక నీరజ్ బంధువు సైతం ఈ అంశంపై స్పందించారు. నీరజ్ మెడల్ తెస్తే దేశం మొత్తం అతనిపై ఆసక్తిని ప్రదర్శించిందని, అలాగే అతని పెళ్లి గురించి కూడా ప్రతి ఒక్కరూ ఇంట్రెస్టింగ్‌గా ఉన్నట్లు తెలిపారు.

## శ్రీలంక బ్యాటింగ్ కోచ్‌గా

# ఇయాన్ బెల్



**జనపదం, స్పోర్ట్స్:** శ్రీలంక జట్టు ఇంగ్లండ్ పర్యటనలో మూడు టెస్టుల కోసం రెడీ అవుతోంది. స్వదేశంలో భారత్‌పై వన్డే సిరీస్ గెలుపొందిన లంక అదే జోష్‌ను టెస్టుల్లోనూ చూపాలనే పట్టుదలతో ఉంది. దీనికోసం హెడ్‌కోచ్ సనత్ జయసూర్యకు సాయంగా బ్యాటింగ్ కోచ్‌ను లంక క్రికెట్ నియమించింది. ఇంగ్లండ్ దిగ్గజం ఇయాన్ బెల్‌ను బ్యాటింగ్ కోచ్‌గా ఎంపికయ్యాడు. ఇంగ్లిష్ పిచ్‌లపై బెన్ స్టోక్స్ బృందాన్ని ఓడించేందుకు లంకకు బెల్ ఎంతవరకు ఉపయోగపడతాడో చూడాలి.

**కోచ్ గా అనుభవం..**

మూడేండ్ల క్రితం ఆటకు అల్విదా పలికిన బెల్‌కు కోచ్‌గా అనుభవం ఉంది. 2021లో అతడు బిగ్‌బాష్ లీగ్ జట్టు అయిన హోబర్ట్ హరికేన్స్‌కు కోచ్‌గా వ్యవహరించాడు. ఆ తర్వాత కౌంటీల్లో డెర్బిషైర్ టీమ్‌కు బెల్ బ్యాటింగ్ కోచ్‌గా తన సేవలందించాడు. ఈ మాజీ క్రికెటర్ ఇంగ్లండ్‌లోని యువ క్రికెటర్లలో నైపుణ్యం పెంచే కార్యక్రమంలో పాల్గొన్నాడు. అంతేకాదు న్యూజిలాండ్ టీమ్ కోచింగ్ స్టాఫ్‌లో సైతం బెల్ పని చేశాడు. దీంతో ఇంగ్లండ్‌ను దెబ్బతీయాలంటే ఆ దేశా నికి చెందిన బెల్ సాయం అవసరమని లంక భావిం చింది. అయితే.. శ్రీలంక సెలెక్టర్లు ఈ ఒక్క సిరీస్‌కే బెల్‌ను పరిమితం చేస్తారా? అనేది తెలియాల్సి ఉంది.

**విధ్వంసక ఆటగాడు..**

ఇయాన్ బెల్ ఇంగ్లండ్ తరఫున 11 ఏండ్ల కెరీర్‌లో ఇయాన్ బెల్ 118 టెస్టులు ఆడాడు. మిడిలార్డర్‌లో విధ్వంసక ఆటగాడిగా పేరొందిన అతడు 22 సెంచరీలు బాదాడు. మొత్తంగా 7,727 పరుగులు సాధించాడు. శ్రీలంక, ఇంగ్లండ్ మధ్య ఆగస్టు 21వ తేదీన మాంచెస్టర్‌లో తొలి మ్యాచ్ జరుగనుంది. అనంతరం ఆగస్టు 29న రెండో టెస్టు లార్డ్స్ లో, సెప్టెంబర్ 6న ఓవల్ మైదానంలో మూడో టెస్టు నిర్వహించనున్నారు. ఈ సిరీస్ కోసం 18మందితో కూడిన స్క్వాడ్‌ను లంక సెలెక్టర్లు ఇప్పటికే ప్రకటించారు.

CINEMA NEWS సినిమా పదం

# అదరగొట్టిన కమిటీ కుర్రోళ్లు..

టాలీవుడ్ నుంచి వచ్చిన యూత్ ఫుల్ ఎంటర్టైనర్ "కమిటీ కుర్రోళ్లు". యువ నటీనటులు చాలా మంది నటించిన ఈ చిత్రాన్ని దర్శకుడు యదు వంశీ తెరకెక్కించగా మెగా డాటర్ నిహారిక కొణిదెల నిర్మించారు. మంచి ప్రమోషన్స్ నడుమ రిలీజ్ చేయగా.. చిత్రం సాలిడ్ హిట్ టాక్ ను తెచ్చుకుంది. మొదటి రోజు నుంచే బాక్సాఫీస్ వద్ద.. కలెక్షన్లు వసూలు చేస్తూ వచ్చిన ఈ మూవీ 4 రోజుల రన్ ని కంప్లీట్ చేసుకుంది. నాలుగు రోజుల్లోనే కమిటీ కుర్రోళ్ళు అన్ని ఏరియాల్లో బ్రేకీవెన్ కొట్టేసినట్టుగా మేకర్స్ ఇపుడు కన్ఫర్మ్ చేశారు. అలాగే ఈ నాలుగు రోజుల్లో ఈ చిత్రం వరల్డ్ వైడ్ గా 7.48 కోట్ల గ్రాస్ ని అందుకొని అదరగొట్టింది. దీనితో సాలిడ్ రన్ ని కొనసాగించింది.







# ఆయ్ కు పుష్ప రాజ్ సపోర్ట్..

**GA2 ఆర్ట్స్ బ్యానర్**పై ప్రముఖ నిర్మాత బన్నీ వాస్ ప్రొడ్యూస్ చేసిన మూవీ 'ఆయ్'. ఈ సినిమా ఆగస్టు 15న రిలీజ్ కానుంది. ఈ సినిమాలో నితిన్ నార్నె, నయన్ సారిక హీరోహీరోయిన్లుగా నటిస్తున్నారు. అంజి కె డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమా పూర్తిగా గోదావరి బ్యాక్‌డ్రాప్‌తో తెరకెక్కడంతో ప్రేక్షకుల్లో ఈ సినిమాపై మంచి బజ్ క్రియేట్ అయ్యింది. ఈ మూవీని టాలీవుడ్‌లోని పలువురు ప్రముఖులు ప్రమోట్ చేస్తున్నారు. తాజాగా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కూడా ఈ సినిమాకు తన బెస్ట్ విషెస్ తెలిపాడు. తనకు అత్యంత సన్నిహితులైన బన్నీ వాస్, విద్యా కొప్పినీడిలకు ఆయ్ సినిమా మంచి విజయాన్ని అందించాలని ఆయన కోరాడు. ఆయ్ సినిమాతో నార్నె నితిన్, నయన్ సారికలకు మంచి హిట్ రావాలని ఆయన కోరారు. ఆయ్ సినిమాకు అల్లు అర్జున్ విషెస్ చెప్పడంతో ఈ సినిమాకు మంచి బూస్ట్ లభించిందని చెప్పాలి.

# ఓటీటీలోకి బోల్డ్ మూవీ..



**మూవీ మేకర్స్** సినిమాలను థియేటర్లలో కంటే కూడా ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలో రిలీజ్ చేసేందుకే ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా చిన్నసినిమాలు, కాంట్రవర్సీ సినిమాలకు ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లు సెకండ్ ఆప్షన్‌గా మారాయి. దీంతో కొంతమంది మేకర్స్ ఓటీటీలో తమ సినిమాలను రిలీజ్ చేసి క్యాష్ చేసుకుంటున్నారు. తాజాగా ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో ఓ బోల్డ్ మూవీ రానుంది. సెన్సార్ బోర్డ్ బ్యాన్ చేసిన ఈ సినిమాను ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ ఆహాలో రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అయ్యారు. "లవ్" అనే పదాన్ని ఇంగ్లిష్‌లో తిరగేసి రాస్తే 'ఎవోల్'(EVOL) అని వస్తుంది. ఇదే టైటిల్‌తో రామ్ వెలగపూడి అనే డైరెక్టర్ ఓ బోల్డ్ కంటెంట్ మూవీని తెరకెక్కించారు. అయితే, ఇందులో బోల్డ్ సీన్స్ ఎక్కువగా ఉండటంతో సెన్సార్ బోర్డు ఈ సినిమాను బ్యాన్ చేసింది. దీంతో ఇప్పుడు ఎవోల్ చిత్రాన్ని ఆహాలో రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఆగస్టు 15న ఈ 'ఎవోల్' అనే సినిమాను రిలీజ్ చేయబోతున్నట్లు అధికారికంగా అనౌన్స్ కూడా చేశారు. సెన్సార్ బోర్డు బ్యాన్ చేసిన ఈ 'ఎవోల్' మూవీలో బోల్డ్ కంటెంట్ ఏ స్థాయిలో ఉందో తెలియాలంటే ఆగస్టు 15 వరకు వెయిట్ చేయాల్సిందే.

# తిరుమలలో జాన్వీ



అలనాటి అందాల తార శ్రీదేవి తనయ, బాలీవుడ్ నటి జాన్వీ కపూర్‌కు నిత్యం దైవ దర్శనాలు చేసుకుంటు ఉంటుంది. స్నేహితులు, బంధువులతో కలిసి తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి దర్శనానికి వెళ్తుంటుంది. తాజాగా మంగళవారం తన తల్లి శ్రీదేవి 61వ జయంతి సందర్భంగా జాన్వీ స్వామి వారిని దర్శించుకుంది. సంప్రదాయ చీరకట్టులో స్నేహితుడు శిఖర్ పహారియాతో కలిసి మంగళవారం ఉదయం వీవీపీ విరామ దర్శన సమయంలో శ్రీవారి సేవలో పాల్గొన్నారు. ముందుగా ఆలయానికి చేరుకున్న జాన్వీకి తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేదాశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

హీరో రామ్ పోతినేని నటిస్తున్న తాజా చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. ఈ మూవీ రెండు రోజుల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాను దర్శకుడు పూరి జగన్నాథ్ డైరెక్ట్ చేయగా, 'ఇస్మార్ట్ శంకర్' చిత్రానికి ఇది సీక్వెల్‌గా తెరకెక్కింది. ఇక ఈ సినిమా పోస్టర్స్, టీజర్, ట్రైలర్, సాంగ్స్‌కు ట్రెమెండస్ రెస్పాన్స్ రావడంతో 'డబుల్ ఇస్మార్ట్'పై అంచనాలు భారీగా క్రియేట్ అయ్యాయి. ఈ సినిమాకు సంబంధించిన డిస్ట్రిబ్యూషన్ డీల్ తాజాగా ముగిసినట్లుగా మేకర్స్ వెల్లడించారు. ఈ సినిమాను నైజాం ఏరియాలో ప్రైమ్‌షో ఫిలింస్ వారు రిలీజ్ చేస్తున్నారు. చాలా సంప్రదింపుల తరువాత ఈ చిత్రాన్ని ప్రైమ్‌షో వారు రిలీజ్ చేసేందుకు మేకర్స్ అంగీకరించినట్లుగా తెలుస్తోంది. ఇక ఈ సినిమా కోసం వారు భారీ రేటును కోట్ చేసినట్లుగా తెలుస్తోంది.




# ప్రైమ్‌షో ఫిలింస్‌కు ఇస్మార్ట్ నైజాం రైట్స్..